బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

మేడ్చల్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగ శుభాకాంక్షలను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలియజేశారు. శనివారం బక్రీద్ పండగ ఉండటంతో ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ త్యాగానికి, సహనానికి, దాణగుణానికి, సోదర భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముస్లీం సోదరులు పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు.

విచారణకు ర్యాలీగా వెళ్లిన ఈటల



కాళేశ్వరం కమిషన్ విచారణకు ఇంటి నుంచి అనుచరులతో కలిసి వెళ్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్: కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్ తన నివాసం నుంచి అనుచరులతో ర్యాలీగా వెళ్లారు. ఎంపీ ఈటల విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో ఉన్న ఈటల నివాసం వద్దకు పెద్ద ఎత్తున అనుచరులు, పార్టీ శ్రేణులు రావడంతో కోలాహలం నెలకొంది. ఉదయం 10 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరిన ఈటల అనుచరులతో కలిసి ర్యాలీగా నగరంలోని బీఆర్‌కేఆర్ భవన్‌కు తరలివెళ్లారు.

'భూభారతి'తో భూసమస్యలకు పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజిని. చిత్రంలో మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రైతుల భూసమస్యలు భూభారతితో పరిష్కారం అవుతాయని తహసీల్దార్ డీఎస్ రజిని అన్నారు. అవుషాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన రెతుసదస్సులో మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి రైతుల నుంచి 34 దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అలేఖ్య, వామన్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్, వామన్‌రెడ్డి, మల్లేశ్, నాగరాజుముదిరాజ్, వెంకట్‌రెడ్డి, అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్-510లో నందనవనం పార్కులో రెవెన్యూ అధికారులు గత నెల 22న ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కాగా, పలువురు కబ్జాదారులు ప్రభుత్వ సూచిక బోర్డును ధ్వంసం చేశారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోయిందని, కబ్జాదారుల నుంచి పార్కును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్మీ డెంటల్ కాలేజీలో హెల్త్ క్యాంప్



ఆర్మీ డెంటల్ కాలేజీలో ఓరల్, డెంటల్ హెల్త్ క్యాంప్ దృశ్యం

జవహర్‌నగర్: ఉన్నత భారత్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి ఆదేశాల మేరకు శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ కాలేజీలో ఒకరోజు ఓరల్, డెంటల్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డెంటల్ సర్జన్ డాక్టర్ పి.వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొత్తం 110 మంది రోగులకు దంత, మౌఖిక ఆరోగ్య సేవలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభ, డాక్టర్ మృణాళిని, డెంటల్ కాలేజీ వైద్య నిపుణులు, మల్కాజిగిరి ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మున్సిపల్ కమిటీ

ఘట్‌కేసర్: బీజేపీ మున్సిపల్ కమిటీని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌ముదిరాజ్, మహేందర్‌మాదిగ, రామతీర్థగౌడ్, వీరేశం, ప్రధాన కార్యదర్శులుగా శ్రీధర్, రాధిక, కార్యదర్శులుగా సిద్ధిరాజ్, మౌనిక, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నరేశ్‌ముదిరాజ్, సహ కోశాధికారిగా పవన్‌సింగ్‌ను ప్రకటించారు.



పూడూరులో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు



కీసర బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయకుమారి, కీసర ఎంఈవో జమదగ్ని



మేడ్చల్‌లోని ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో ఎంఈఓ, ఉపాధ్యాయులు, చిన్నారులు

ర్యాలీలు.. గ్రామసభలు..

'బడిబాట'ప్రారంభం
- ఇంటింటికీ ఉపాధ్యాయుల ప్రచారం
- సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపే లక్ష్యం

మేడ్చల్‌రూరల్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలతో సందడి నెలకొంది. ప్రత్యేక షెడ్యూల్‌తో ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఉచితంగా విద్యాబోధన, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నా పాఠశాలల్లో బాలల సంఖ్య పెరగకపోవడంపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. ఆధునిక బోధన పద్ధతుల అమలు, బాలల అభ్యాసన సామర్థ్యాలపై దృష్టి సారిస్తున్న విద్యాశాఖ విద్యార్థుల సంఖ్య పెంపు కోసం ప్రత్యేక కార్యక్రమంగా బడిబాట చేపట్టింది.

బడిబాట రోజువారీ కార్యక్రమాలు..

- 6న బడిబాట కార్యక్రమం ప్రారంభించి ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించడం
- 7న ఉపాధ్యాయులు ప్రతీ ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా చైతన్య పరచడం
- 8-10 తేదీ వరకు బడిబాట కరపత్రాలతో ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 11న ఆయా కార్యక్రమాలపై సమీక్ష
- 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులను ప్రారంభించడం, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ
- 16న ఎఫ్ఎల్ఎన్ ఎల్ఐపీ దినోత్సవాలు నిర్వహించడం
- 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం
- 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడం
- 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం

ర్యాలీలు, గ్రామసభలు..

మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో బడిబాట కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. వార్డులు, గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్తులు బడిబాట ర్యాలీ చేపట్టి అనంతరం వార్డు, గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఘట్‌కేసర్ పట్టణంలో..

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాల, జెడ్పీ బాలికలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, విజయ, యాదగిరిరావు ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉచితంగా భోజనం, బుక్కులు, డ్రెస్సులతో పాటు మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందజేస్తోందని ప్రచారం చేశారు.



అత్వెల్లి పాఠశాలలో బడిబాటలో భాగంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రవేశాల పెంపు లక్ష్యంగా కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా బడిబాటను ప్రారంభించాం. ఉపాధ్యాయులకు ఇప్పటికే పలు సూచనలు చేశాం. కొత్తగా పిల్లలను చేర్చుకోవడంతోపాటు పాఠశాలల్లో అందిస్తున్న నూతన విద్యాబోధన విధానం, నాణ్యమైన విద్య, వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి బడులను బలోపేతం చేయాలి.

– శంకరయ్య, ఎంఈఓ, మేడ్చల్

బడీడు పిల్లలు బడిలో ఉండాలి

కీసర మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కీసర జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కీసర ఎంఈవో జమదగ్ని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– జిల్లా విద్యాధికారి విజయకుమారి

బీజేపీని బలోపేతం చేయాలి

మేడ్చల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ మేడ్చల్ మున్సిపాలిటీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సన్నాహక సమావేశం మున్సిపల్ అధ్యక్షుడు జెల్లి శైలజ హరినాథ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నారెడ్డి నందారెడ్డి, సీనియర్‌నేత కిషన్‌రావు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, నాయకులు లవంగ శ్రీకాంత్, మైసరి రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వంశీధర్‌రెడ్డి, ఈశ్వర్ కూర్మ, జిల్లా బీజేవైఎం నాయకుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీటీసీలో మొక్కలు నాటిన పోలీసులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్పీ మధుకర్ స్వామి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి పీటీసీ ఆవరణలో వెయ్యి మొక్కలు నాటారు.

వార్డుల విభజన సక్రమం చేయాలి

శామీర్ పేట్: నూతనంగా ఏర్పడిన అలియాబాద్ మున్సిపాలిటీ వార్డుల విభజనను సక్రమంగా చేయాలని కోరుతూ రాష్ట్ర వడ్డెర సంఘం వైస్ చైర్మన్ గండికోట కుమార్ అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. విలేజ్ మ్యాప్ ప్రకారం సర్వే చేసి ఏ వార్డుకు సంబంధించిన వ్యక్తులను ఆ వార్డులో చేర్చాలని గండికోట కుమార్ డిమాండ్ చేశారు. అలియాబాద్ వడ్డెర బస్తీకి ఆనుకొని ఉన్న ఆనంద్‌నగర్ కాలనీని అలియాబాద్ వార్డులో కలపాలని విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ గౌతమ్



జగన్‌గూడ రెవెన్యూ సదస్సులో కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం జగన్‌గూడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖాముఖి నిర్వహించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. ఉద్దమర్రిలో 104, జగన్ గూడ 46, సంపన్ బోల్‌లో 25 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి తెలిపారు. శామీర్ పేట మండలంలోని బొమ్మరాసిపేట 100, తుర్కపల్లిలో 41 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు ఉజ్వల భవిష్యత్తు



పట్టాలు అందుకున్న సంస్కృతి పాలిటెక్నిక్ విద్యార్థులతో అంజయ్య

ఘట్‌కేసర్: నైపుణ్యం ఉన్న ఫార్మసిస్టులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కామినేని మెడికల్ కాలేజ్, రీసెర్చ్ సెంటర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కనుపాలి అంజయ్య అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఆరోగ్య అభివృద్ధి రంగం, నూతన ఔషధ రూపకల్పనలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఆరోగ్య సంరక్షణ, సురక్షిత తనిఖీలు, డేటా సేకరణలో ఫార్మసిస్టులకు క్లినికల్, నాన్ క్లినికల్ విభాగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా శ్రవణ్ కుమార్, 200 మంది విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

డ్రోన్లతో రైతులకు ఎంతో మేలు



శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ సుధారెడ్డి

డాక్టర్ సుధారెడ్డి



శిబిరంలో ఏర్పాటు చేసిన డ్రోన్లు

పోచారం: రైతులు ఎదుర్కొంటున్న కూలీల కొరతను డ్రోన్ల సాయంతో అధిగమించవచ్చని ఎం.డీ.కే.ఎస్. బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డీ.డాక్టర్ పి.సుధారెడ్డి అన్నారు. శుక్రవారం యంనంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీలో అగ్మాయ్ టెక్నాలజీ సంస్థ ఏర్పాటు చేసిన 'డ్రోన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్'శిక్షణ తరగతులను ప్రారంభించారు. సుధారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ డ్రోన్లకు ప్రాధాన్యతనిచ్చి సరికొత్త ఆశలకు పునాది వేసిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం తీరు మారుతోందని, కొన్నేళ్ల నుంచి యంత్రాల వాడకం బాగా పెరిగిందన్నారు. బురదలో దిగి సాధారణ స్ప్రేయర్లతో మందులు పిచికారి చేయడం పెద్ద ప్రయాసేనని పేర్కొన్నారు. డ్రోన్ల వినియోగంతో ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెనిసిస్ ఇన్ఫో సీఈఓ డాక్టర్ వినయ్ సారికొండ, ఆర్‌బీఎం ఇన్ఫ్రాకాన్ ఎండీ జే భజరంగ్ మణి, రిటైర్డ్ ఐఆర్ఎస్ మజ్జి లక్ష్మీకరరావు, శ్రీవిఘ్నేశ్వర డ్రోన్స్ ఎండీ ఎల్.సంతోష్‌రెడ్డి, సింకోసెర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండీ రాజా సురేష్‌రెడ్డి, స్విస్ట్ సీఈఓ కే.అభిజిత్ రావు, ప్రిన్సిపాల్ డా.టీసీహెచ్.శివారెడ్డి, అగ్మాయ్ టెక్నాలజీస్ సీఈఓ ఎమ్.అజయ్ సాగర్, కోఆర్డినేటర్లు డా.ఎస్‌పీవీ సుబ్బారావు, డా.సీఎస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి.. కేసు నమోదు

మల్కాజిగిరి: పాత కక్షలతో ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పరిగూడకు చెందిన శక్తి పెంటర్‌బాబు కుమారుడు విశాల్(19) పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5న స్నేహితుడు మనీష్‌తో కలిసి బైక్ మీద వెళ్తుండగా రాజానగర్ ప్రాంతంలో శక్తి నవీన్ అడ్డుకున్నాడు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని కత్తితో విశాల్‌పై దాడి చేయగా వీపు, కుడి భుజం మీద తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విశాల్ తండ్రి పెంటర్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చికెన్ సెంటర్ల సీజ్

నిల్వ ఉంచిన చికెన్ అమ్ముతున్నారని కొరడా



చికెన్ సెంటర్‌కు తాళాలు వేసిన కమిషనర్, మున్సిపల్ అధికారులు

మేడ్చల్: మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తన సిబ్బందితో కలిసి మేడ్చల్ పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రెండు చికెన్ షాపులను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను సీజ్ చేశారు. మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని సుగుణ చికెన్ సెంటర్, అక్బర్ చికెన్ సెంటర్, మేడ్చల్ ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఎస్ఎఫ్‌సీ ఫాస్ట్ ఫ్రైడ్ సెంటర్లలో తనిఖీలు చేసి సీజ్ చేశారు. వీటిల్లో మాంసం అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని, ఏమాత్రం పరిశుభ్రత పాటించడం లేదని అధికారుల దృష్టికి రావడంతో కొరడా ఝుళిపించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మరిన్ని ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని, నిబంధనలకు వ్యతిరేకంగా ఉండే వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

శామీర్‌పేట్: తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో డీవైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం సత్తిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల వల్ల క్రీడాకారులు ఆటలకు మరింత దగ్గరవుతారని అన్నారు. శిబిరంలో 60 మంది క్రీడాకారులు శిక్షణ పొందినట్టు శిక్షకుడు వినోద్‌కుమార్ తెలిపారు. శిక్షణ ముగించుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఖో- ఖో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యాయుడు తిరుమలేష్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, పావనీ జంగయ్య

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మండల మాజీ అధికారి ప్రతినిధి మాధవరెడ్డి తదితరులు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, బలహరణం, పూర్ణాహుతి చేశారు. ఐలయ్య యాదవ్, బిక్షపతి గౌడ్, జంగయ్య ముదిరాజ్, వామన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జంగయ్య యాదవ్, బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన

శామీర్ పేట్: శామీర్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు ఇవ్వటం లేదని రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సంచుల కోసం టోకెన్‌లు తీసుకుని తమకు నిర్దేశించిన సమయానికి కేంద్రం వద్దకు చేరుకున్నారు. అయినా సంచులు సరిపడా లేవని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. 226 మంది రైతులకు టోకెన్లను ఇచ్చిన అధికారులు వారికి సంచులు అందజేయడంలో విఫలమయ్యారు. సుమారు 8 వేల సంచులు అవసరంకాగా, 2,400 మాత్రమే అంటుబాటులో ఉన్నాయి. సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే సంచులను తెప్పించి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, కొండల్ రెడ్డి, ప్రభాకర్, బాలమణి, సాయిలుయాదవ్, బుచ్చిరెడ్డి, మాధవ రెడ్డి, ఇంద్రారెడ్డి, రఘుపతి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సాగు వ్యయం తగ్గించుకోవాలి



మాదారంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

ఘట్‌కేసర్: అన్నదాతలు పంట సాగు వ్యయం తగ్గించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుధా, మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాదారం రైతులకు అవగాహన కల్పించారు. అధికారిక దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. అనంతరం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, జంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మైసయ్య, పోచయ్య పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకొని యువకుడి మృతి

పోచారం: మద్యానికి బానిసైన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన అనూప్(29) ఉపాధి కోసం రెండు నెలల క్రితం బోడుప్పల్ వచ్చి ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తన జీతం డబ్బులను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా మద్యం తాగడానికే ఖర్చు చేస్తూ భార్యతో గొడవపడేవాడు. శుక్రవారం ఉదయం నారపల్లిలో ఉంటున్న తన బావ దీపు గుప్తాకు ఫోన్ చేసి భార్యతో గొడవ పడ్డానని, ఆత్మహత్య చేసుకోవాలనే అనుకుంటున్నానని చెప్పాడు. దీపు వారించినా వినిపించుకోకుండా ఫోన్ కాల్ కట్ చేశాడు. అదే రోజు మధ్యాహ్నం జోడిమెట్లలోని యూనివర్సల్ బేకరీ వెనక ఉన్న వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. దీపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.